క్లుప్తంగా

ఈనెలాఖారు లోపు పన్నులు వసూలు చేయాలి

నిడదవోలు రూరల్: మండలంలోని 23 గ్రామాల్లో ఈనెలఖారులోపు నూరుశాతం ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మినారాయణ ఆదేశించారు. సమిశ్రగూడెంలో ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఆదేశాలతో నిర్వహిస్తున్న వివిధ సర్వేలను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

గోపాలపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని పీవీరావు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దూబచర్లలో అంబేడ్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యమే ఈ దారుణాలకు కారణమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అసెంబ్లీలో రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తూ తీర్మానం చేసిన వెంటనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేయడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. గోపాపులరం మాల మహానాడు మండల అధ్యక్షుడు కొయ్య వెంకటరమణ, రాపాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

నిడదవోలు రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తాడిమళ్ల, కాటకోటేశ్వరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతు రిజిస్ట్రీ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులంతా వెంటనే తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటలో దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

గజ్జరంలో చిల్డ్రన్ హోమ్ తనిఖీ



గజ్జరంలోని చిల్డ్రన్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి: గజ్జరంలోని డీసీఎం హాస్టల్ వద్ద ఉన్న చైల్డ్ హోమ్‌ను సోమవారం రాత్రి కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత ఆకస్మిక తనిఖీ చేశారు. చైల్డ్ హోప్ ఫౌండేషన్ చిల్డ్రన్ హోమ్‌లోని పిల్లలను భోజనం చేస్తున్న సమయంలో అక్కడ పరిశీలించారు. వారిని సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యత, వసతి, రికార్డులను, విద్యార్థుల హాజరు శాతం తదితర వాటిని పరిశీలించారు.

పోచవరంలో చెరువు పరిశీలన

పోచవరంలోని పాత్రుని చెరువులో పశువులకు నీరు అందడం లేదన్న కారణంగా చేపట్టిన చర్యలను పరిశీలించి రైతుల నుంచి నీటి సరఫరాపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పశువులకు తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని చెరువులో నీరు సరఫరా చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పి.మోహన భారతి, ఆర్ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో బోర్ల నిర్మాణ పనులు

తాళ్లపూడి: మండలంలో తాగునీటి బోర్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు మండల ఆర్ డబ్ల్యూస్ ఏఈ షేక్ సూర్జాన్ తెలిపారు. సోమవారం షేక్ సూర్జాన్ మాట్లాడుతూ మండలంలో జెడ్పీ నిధుల నుంచి ఒక్కో బోరుకు రూ.5 లక్షలు విడుదలయ్యాయని తెలిపారు. వేగేశ్వరపురం, ప్రక్కిలంక , గజ్జరం, తిరుగుడుమెట్ట, పోచవరం గ్రామాల్లో బోర్లు వేస్తున్నట్టు తెలిపారు. జల్ జీవన్ మిషన్‌లో అన్నదేవరపేట, తుపాకులగూడెం, పెద్దేవం, తాడిపూడి, తిరుగుడుమెట్ట, తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. 10 గ్రామాల్లో పైప్‌లైన్‌కు నిధులు మంజూరు అయినట్టు తెలిపారు.

అజ్జరం వాసికి ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా నియామకం

పెరవలి: అజ్జరం గ్రామానికి చెందిన పెచ్చెట్టి కోటేశ్వరరావు ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో ఆయనకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా ఏ కులానికైనా న్యాయం జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే జరుగుతుందని, అందుకు తానే ఒక ఉదాహరణ అని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ ప్రముఖులు అభినందించారు.

నిబంధనలకు నీళ్లు

- అక్రమ కట్టడాల జోరు
- అనుమతుల్లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం
- మామూళ్ల మత్తులో అధికారులు



పెరవలిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు

పెరవలి: గ్రామాల్లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులేకుండా, నిబంధనలు పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. బహుళ అంతస్తు భవనాలు నిర్మించాలంటే అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ యథేచ్ఛగా అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు మామూళ్లమత్తులో తేలుతున్నారు. వారిని కీలుబొమ్మలుగా చేసుకొని తెలుగుతమ్ముళ్ల ఇష్టారాజ్యం చేస్తున్నారు.

ఆదాయానికి గండి

నాయకులు, అధికారులు చేస్తున్న పనుల వలన పంచాయతీలకు వేలాది రూపాయల ఆదాయం కోల్పోయి, అధికారుల జేబులు నిండుతున్నాయి. అంతేకాకుండా ఈ నిర్మాణాల గురించి ఎవరైనా అడుగుతుంటే నిర్మాణదారులకు మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. బహుళ అంతుస్తుల నిర్మించాలంటే పంచాయతీల అనుమతి తప్పనిసరి అంతే కాకుండా మూడు అంతస్తులు దాటితే పంచాయతీలు అనుమతులు ఇవ్వకూడదు అనే నిబంధన ఉన్నా ఇక్కడ మాత్రం పట్టించుకోవటం లేదు. ఎన్ని అంతస్తులు నిర్మించుకున్నా పర్వాలేదు, నిబంధనలు ప్రకారం నిర్మిస్తున్నారా లేదా అనే ప్రశ్నించే వారే లేరు.

పెరవలి మండలంలో నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, పెరవలి, ఖండవల్లి ఇలా ఒకటేమిటి అన్ని గ్రామాల్లో ఈ బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. అంతే కాకుండా వీటి గురించి ప్రశ్నించిన పత్రిక ప్రతినిధులకు అధికారులే స్వయంగా మామూళ్లు ఇవ్వడం కొసమెరుపుగా చెప్పవచ్చు.

నిబంధనలివీ

- బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టేవారు ముందుగా పంచాయతీకి ప్లాన్ అప్రూవల్‌కి దరఖాస్తు చేసుకోవాలి. ప్లాన్‌లో చూపించిన విధంగా అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వాలి.
- బహుళ అంతస్తులు అంటే మూడుకన్నా ఎక్కువ అంతస్తులు నిర్మిస్తే పంచాయతీలు అనుమతులు ఇవ్వకూడదు. వీటి నిర్మాణాలకు అగ్నిమాపక అనుమతులు తీసుకోవాలి.
- బహుళ అంతస్తు నిర్మాణాలు నిర్మించే స్థలం లేఅవుట్‌లో అయితే దానికి అనుమతులు ఉండాలి. అన్ని అక్రమ లేఅవుట్లలో నిర్మిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులే బాధ్యులు



అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు నిర్మిస్తే చర్యలు తీసుకుంటాం అక్రమ లేఅవుట్లలో భవనాలకు అనుమతులు ఇస్తే ఆయా పంచాయతీల కార్యదర్శులే బాధ్యులు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం .

– సీహెచ్ వెంకట రమణ, ఎంపీడీఓ, పెరవలి

- బహుళ అంతస్తులకు ఏర్పాటు చేసిన మెట్లు వెడల్పు 1.25 మీటర్లు పైన ఉండాలి.
- మూడు అంతస్తుల భవనాల ఎత్తు 16 మీటర్ల ఎత్తు ఎట్టి పరిస్థితుల్లో దాటకూడదు.
- బహుళ అంతుస్తుల భవనాలకు గాలి వెలుతురు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలి. ఇవి ఏమీ పాటించటంలేదు.
- పంచాయతీ ప్లాన్ అప్రూవల్‌ను భవన నిర్మాణం వద్ద అందరికీ కనిపించేలా, తెలిసేలా ఏర్పాటు చేయాలి.
- ప్రతి భవనాన్ని నిర్మించడానికి ఒక ఇంజినీరును నియమించుకోవాలి.
- ప్రతి భవనానికి పార్కింగ్ ప్లేస్ ఉండాలి. ఇలా నిబంధనలు ఉంటే వీటిలో ఏ ఒక్కటి అమలు చేయపోయిన అధికారులు నిర్మాణాలను ఆపేయవచ్చు.



కొత్తపల్లి అగ్రహారంలో బహుళ అంతస్తుల భవనం

ప్రస్తుతం గ్రామాల్లో పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వకుండనే నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు కూడా వాటిని పట్టించుకోవడం లేదంటే ఏ స్థాయిలో మామూళ్ల అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇదే అదునుగా తీసుకున్న మరికొన్ని గ్రామాల్లో అక్రమ లేఅవుట్ వేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా స్థానిక పంచాయతీలు నిమ్మకు నీరెత్తిన ట్లు వ్యవహరించటంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అసలే అక్రమ లేఅవుట్లు అయితే వీటి నిర్మాణాలను పంచాయతీలు పట్టించుకోకపోవడం వలన ఆదాయం వేలాది రూపాయిలు, లక్షలాది రూపాయిల విలువ కలిగిన భూమిని కోల్పోతున్నాయి.

రోడ్లపై ఇసుక తొలగింపు



ప్రక్కిలంక వద్ద ఏటి గట్టు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పై చేరిన ఇసుకను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

తాళ్లపూడి: రోడ్లపై చేరిన ఇసుక తొలగింపు చర్యలు అధికారులు చేపట్టారు. ఈ నెల 19వ తేదీన సాక్షిలో వచ్చిన 'ప్రమాదభరితంగా రోడ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ పి.మోహన్‌భారతి స్పందించారు. ఆమె ఆదేశాలతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రక్కిలంక, తాళ్లపూడి, బల్లిపాడు తదితర ప్రాంతాల్లో వాహనదారుల నిర్లక్ష్యంతో ఆర్అండ్‌బీ రోడ్ల పై పడిన ఇసుకను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు సమీపంలోని ఇసుక ర్యాంపు నిర్వాహకులు స్పందించకపోవడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు సిబ్బంది ఇసుకను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇసుకను రవాణా చేసే వాహనాలపై టార్పాలిన్లు కప్పి తీసుకుని వెళ్లాలని, అలా చేయకుంటే లారీల పై కేసులు నమోదు చేస్తామన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వండి

- ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి
- పొగాకు బోర్డు ఈడీకి మహిళా రైతుల విజ్ఞప్తి

దేవరపల్లి: పొగాకు పంట ఉత్పత్తి ఖర్చులు పెరిగినందున గిట్టుబాటు ధర ఇచ్చి రైతు కుటుంబాలను ఆదుకోవాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పలువురు మహిళా రైతులు పొగాకు బోర్డు ఎగ్జికూటివ్ డైరెక్టర్ (ఈడీ) బి.విశ్వశ్రీకి విజ్ఞప్తి చేశారు. ఈడీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన విశ్వశ్రీ తొలిసారిగా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఆమెకు వేలం కేంద్రం రైతు సంఘం ప్రతినిధులు, మహిళా రైతులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం, బోర్డు కార్యాలయంలో మహిళా రైతులతో ఈడీ విశ్వశ్రీ సమావేశమై, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మాట్లాడుతూ, పొగాకు సాగులో తమ పాత్ర చాలా ఉందని చెప్పారు. పొగాకు రెలుపులు, క్యూరింగ్ సమయంలో కూలీల కొరత ఎక్కువగా ఉందని, కొన్ని సందర్భాల్లో కూలీలు ఎక్కువ వేతనాలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. పొగాకు అమ్మకాల సమయంలో మార్కెట్ ఒడుదొడుకుల్లో నడుస్తోందని, అటువంటి సమయంలో ముందుగా అమ్ముకున్న వారు నష్టపోతున్నారని చెప్పారు. మార్కెట్ చివరిలో ధర పెరుగుతోందని, ప్రారంభ ధరకు, ముగింపు ధరకు చాలా వ్యత్యాసం ఉంటోందని అన్నారు. కొనుగోళ్ల ప్రారంభం నుంచి ముగిసే వరకూ ధర నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ, ట్రేడర్లు, అధికారులతో చర్చించి రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో ఉత్తర తేలిక నేలలు (ఎన్ఎల్ఎస్), సదరన్ బ్లాక్ సాయిల్ (ఎస్‌బీఎస్) పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో 67 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. కిలో సగటు ధర రూ.270 నుంచి రూ.280 లభిస్తోందని తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి ప్రారంభ ధర ఎక్కువగా ఉందని, ముమ్ముందు మంచి ధర వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. సిబ్బంది కొరత ఉన్నట్లు రైతులు చెప్పారని విశ్వశ్రీ చెప్పారు. సమావేశంలో వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాట్రు వీర వెంకట సత్యనారాయణ, వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, విస్తరణాధికారి దామోదర్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. నాలుగు దశాబ్దాల పొగాకు బోర్డు చరిత్రలో మహిళా రైతులు తొలిసారిగా వేలం కేంద్రానికి వచ్చి తమ సమస్యలను ఉన్నతాధికారికి వినిపించి, పొగాకు వేలంలో పాల్గొనడం విశేషం.



మహిళా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ

పెట్రోలు బంకులో తనిఖీలు



పెట్రోలు బంకులో నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు

దేవరపల్లి: స్థానిక గోపాలపురం రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకును రెవెన్యూ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. బంకులో మరుగుదొడ్ల సదుపాయం లేదని, వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలు లేవని, పెట్రోలు నాణ్యత ఉండటం లేదని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ శ్రేణులు బంకు వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బంకును నిర్వాహకులు ఆండ్రు వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ సమక్షంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. పెట్రోలు డెన్సిటీ తనిఖీ చేశారు. బంకు వద్ద మరుగుదొడ్లు, వాహనాలకు గాలి పెట్టడం, మంచినీరు వంటి సదుపాయాలున్నాయని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. స్టాక్ బోర్డు, ధరల పట్టిక సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో కల్తీ లేదని చెప్పారు. పెట్రోలు నాణ్యతలో ఎవరికైనా అనుమానం ఉంటే అధికారులకు, కంపెనీ మేనేజర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బంకు వద్దకు వచ్చి ఆందోళన చేయడం మంచిది కాదన్నారు. బంకు నిర్వాహకులు ఆండ్రు వెంకటేశ్వరరావు, ఆండ్రు అనిల్ మాట్లాడుతూ, బంకులో ఎటువంటి అవకతవకలూ జరగడం లేదన్నారు. కొంత మంది బంకు వద్దకు కావాలని వచ్చి అల్లరి చేసి, సిబ్బందిని దుర్భాషలాడి, భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సిబ్బందికి భద్రత కల్పించాలని రెవెన్యూ అధికారులను కోరారు. నిత్యావసర సరకులు, మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మాలని చెప్పారు. బంకు తన భార్య పేరిట ఉందని అనిల్ చెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అనంతపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా వారు చదువుకున్న పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. తమతో చదువుకుని ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న భవానీ, సురేంద్ర, టీసీఎస్‌లో పనిచేస్తున్న రామిశెట్టి నాగదేవి, చంద్రు అయ్యప్ప, పోలీస్ శాఖలో గన్‌మెన్‌గా పనిచేస్తున్న బుసనబోయిన ఏడుకొండలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమకు చదువు చెప్పిన గురువులు నిమ్మలపూడి వీరరాఘవులు, విమల, శివభారతి, వీర్రాజు, కిశోర్, బాదుషాలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని వీరంతా తీర్మానించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

గోపాలపురం: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు నాణ్యమైన వర్జీనియా పొగాకు ఉత్పత్తి చేయాలని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ రైతులు మేలు రకం పొగాకు ఉత్పత్తి చేయడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. పురుగు మందుల అవశేషాలు లేకుండా పొగాకు పండించాలని రైతులకు సూచించారు. 27 బేళ్లకు వేలం నిర్వహించగా కిలో రూ 290 పలికింది. సరాసరి ధర రూ.290 వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పెట్టుబడి పెరిగిందని, సరాసరి ధర వచ్చేలా చూడాలని ఈడీని రైతులు కోరారు. ఆమె వెంట రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఆర్ఎవీ ప్రసాద్, వేలం నిర్వాహణాధికారి అమూల్ ఢీశ్యామ్, రైతుసంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, గౌరవాధ్యక్షులు జి.శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్, పరమి జగదీష్, నందమూరి సత్యనారాయణ, కూసం రామ మోహన్‌రెడ్డి, ఇల్లూరి పెంటలరాజు పాల్గొన్నారు.



గోపాలపురం వేలం కేంద్రంలో పొగాకును పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ, రైతు సంఘం నాయకులు

అజెండాకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పురపాలక సంఘం సోమవారం సాయంత్రం నిర్వహించిన అత్యవసర సమావేశంలో అజెండాలో పేర్కొన్న ఆరు అంశాలలో ఐదు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన ఈ అత్యవసర సమావేశం జరిగింది. ప్రజారోగ్య విభాగంలో పెద్ద కంపాక్టర్, చిన్న కంపాక్టర్లు రిపేర్లు మరమ్మతులకు గురి కావడం అద్దె ప్రతిపాదికన రెండు ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గెజిట్ నోటిఫికేషన్ అనుసరించి కొవ్వూరు రోడ్డు మార్జిన్, బాపూజీ కూరగాయల మార్కెట్‌లో వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకునే హక్కు కోసం ఈనెల 19న వేలం నిర్వహించగా మలకపల్లికి చెందిన ఇలపన అనంతలక్ష్మి హెచ్చు పాటదారునిగా రూ.28,05,000 దక్కించుకున్నారు. వీటికి స్వీపింగ్ చార్జీలతో కలిపి రూ.29.49లక్షల చెల్లించేలా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నాయుడు వీర్రాజు, బేతిన వెంకట ప్రసాద్ మధ్య ఉన్న వ్యాజ్యం ప్రకారం ప్రసాద్‌కి చెందిన రూ.7.40 లక్షల బిల్లు నిలిపివేసి కోర్టు ఉత్తర్వుల మేరకు గోదావరి పుష్కరాల్లో చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, సాధారణ నిధులకు జమ చేయుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నాలుగో అంశంలో పేర్కొన్న వివిధ వార్డుల్లో అసెస్మెంట్ డబుల్ ఎంట్రీ ఉన్న 85 మందిని ఆన్‌లైన్‌లో తొలగించాలన్న అంశాన్ని వాయిదా వేశారు. రైల్వే స్టేషన్‌లో 2019లో ఆగే అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని తీర్మానం చేశారు. కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ సమావేశానికి తక్కువ సంఖ్య సభ్యులు హాజరు కావడాన్ని తప్పు పట్టారు. కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

కవి డాక్టర్ ప్రమోద్ కుమార్‌కు సన్మానం



కవి జొన్నకూటి ప్రమోద్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న రచనలపై పరిశోధనా పత్రం సమర్పించిన పైడిమెట్ట గ్రామానికి చెందిన కవిడాక్టర్ జొన్న కూటి ప్రమోద్‌కుమార్‌ను శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సత్కారం అందుకున్నారు. రాజమండ్రిలో ఏపీ ప్రభుత్వ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన బోయి భీమన్న జాతీయ సాహిత్య సదస్సులో మహాకవి భీమన్న రచనలపై ప్రమోద్ సమర్పించిన "డా బోయి భీమన్న రచనల్లో సామాజిక స్పృహ" అనే పరిశోధన పత్రానికి పురస్కారం లభించడంపై పలువురు ప్రమోద్‌ను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్‌బోయి భీమన్న సతీమణి హైమావతి, శ్రీ శ్రీ కళా వేదిక సీఈఓ డా.కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారథి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నరసిపల్లి హరిక, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, మహిళా విభాగం అధ్యక్షురాలు చెట్టి లలిత, ఆది కవి నన్నయ యూనివర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ఫిలాంత్రోపిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజయోనా తదితరులు పాల్గొన్నారు.


కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

దేవరపల్లి: చంద్రబాబు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, కాలనీ వాసులు సోమవారం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించారు. కాలనీ ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలవుతోందని, ఇప్పటి వరకూ కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ బోరు, ఓవర్ హెడ్ ట్యాంకు ఉన్నప్పటికీ సుద్ధ నీరు కావడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. యాదవోలు రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో బోరు వేసి, జలకళ పథకంలో సుమారు రూ.30 లక్షలతో కాలనీకి పైపులైన్ వేసి ఏడాది పూర్తయిందన్నారు. ఇప్పటి వరకూ మోటార్ ఏర్పాటు చేయకపోవడంతో ఆ బోరు నిరుపయోగంగా మారిందన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరాన యాదవోలు రోడ్డులో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి టిన్నులతో మంచినీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని తెలిపారు. వెంటనే బోరుకు మోటారు ఏర్పాటు చేసి, మంచినీరు సరఫరా చేయాలని కోరారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, కుక్కల బెడదను నివారించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, రైతు సంఘం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, రైతు కూలీ సంఘం నాయకులు కొత్తగుండ రత్నాజీ, పిన్నమనేని సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు. యాదవోలు రోడ్డులో వేసిన బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.2.05 లక్షలు చెల్లించామని పంచాయతీ కార్యదర్శి రవికిషోర్ తెలిపారు. దీనికి సంబంధించిన వర్కార్డర్ రెండు రోజుల్లో స్థానిక విద్యుత్ శాఖ అధికారికి అందజేసి, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి, మంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

వర్గీకరణ సాకుతో ఎస్సీల్లో చిచ్చు పెడతారా?



నల్లజర్లలో మాట్లాడుతున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

నల్లజర్ల: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మోసపూరితంగా వ్యవహరిస్తోందని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మండిపడ్డారు. సోమవారం సాయంత్రం నల్లజర్ల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద వీరంతా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలశాఖ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ఈ విషయంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. వర్గీకరణ అంశాన్ని ఇంకా రాజకీయం చేయాలన్న చంద్రబాబు వైఖరి ఇక్కడే బయట పడిందని ఉపాధ్యక్షుడు పిల్లి కాంతారావు అన్నారు.తెలంగాణ అసెంబ్లీలో బిల్లుపెట్టి పకడ్బందీగా చట్టం తెస్తున్నారని ఆంధ్రప్రదేశ్‌లో అలా ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. బిల్లును ప్రవేశ పెట్టిన అంశాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం విచారకమన్నారు. దూబచర్ల శివారు గాంధీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సమావేశం కోరింది. సమావేశంలో గుదే శ్రీనివాస్, వడ్డి శ్రీను, అందుగుల వెంకటేశ్వరావు, కోటేశ్వరావు, కూరపాటి నాగరాజు, కాకి వెంకటేశ్వరరావు, ఉసులుమర్తి సాయి, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రధాన మంత్రి ఉచ్ఛతర యోజన అభియాన్ (పీఎం- ఉష) పథకం నిధులు రూ.3.60 కోట్ల వ్యయంతో నిర్మించే అదనపు గదులు, మౌలిక వసతుల కల్పనకు చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ఉన్నత విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి హాజరై మాట్లాడుతూ విద్యార్థినులకు ఉత్తమ విద్యతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. న్యాక్‌బీ ప్లస్ ప్లస్ గ్రేడు రావడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర, అధ్యాపకులను అభినందించారు. న్యాక్ గ్రేడు వలనే పీఎం ఉష నిధులు వచ్చాయన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ మహమ్మద్ షాకిరా బేగం అధ్యాపకురాలు తదితరులు పాల్గొన్నారు.